క్లుప్తంగా

ఈద్గాలో మౌలిక వసతులు కల్పించాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న ముస్లిం నాయకులు

రాయికల్: పట్టణంలోని ఈద్గా వద్ద మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ రాయికల్ ముస్లిం సెంట్రల్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు మున్ను మాట్లాడుతూ బక్రీద్ పండగ సందర్భంగా వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మొబిన్, షాకీర్, ఇంతియాజ్, రసూల్, మసూద్‌ఖాన్, ఖాజామియా, నజీర్, జమీల్ పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులను పూర్తిచేయాలి



వివరాలు తెలుసుకుంటున్న ఎంపీడీవో

మల్లాపూర్: గ్రామాల్లో ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో రాజశ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని సిరిపూర్, నడికుడ, చిట్టాపూర్ గ్రామాలను ఆయన సందర్శించి గ్రామపంచాయతీలో పలు రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధిహామీ పథకం కింద చేపడుతున్న పనులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం వననర్సరీల్లో మొక్కలు, వర్మికంపోస్ట్ షెడ్డును పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు భూక్య గోవింద్‌నాయక్, కడకుంట్ల సాయికుమార్, భూక్య రుక్మా, పంచాయతీ కార్యదర్శులు, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బోరుబావి పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న నాయకులు

కథలాపూర్: మండలంలోని దుంపేటలో బోరుబావి పనులకు మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి సోమవారం భూమిపూజ చేశారు. మండల పరిషత్ నిధులు రూ.1.25 లక్షలతో బోరుబావి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ జవ్వాజి రేవతి, ఎంపీటీసీ మల్యాల రమేశ్, సర్పంచ్ అంబటి లత, కోఆప్షన్ సభ్యుడు ఎం.డీ రఫీక్, డైరెక్టర్లు జెల్ల వేణు, గుండారపు గంగాధర్, భూపెల్లి రాకేశ్, కొత్తపెల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్

రాయికల్: మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు అన్నారు. సోమవారం ది ఫైనల్ డోస్ షార్ట్‌ఫిల్మ్ టీజర్, పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ తురగ శ్రీధర్‌రెడ్డి, హుస్సేన్, షార్ట్ ఫిల్మ్ డైరెక్టర్ అజయ్, రాపర్తి సిద్ధాంత్, సినిమాటోగ్రఫీ బోగ వంశీకృష్ణ, నటులు ముదిగం చిన్న, కాసర్ల శ్రీనివాస్, కొత్తపల్లి మనోజ్, పబ్బతి మహేశ్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

ఇబ్రహీంపట్నం: మండల తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన రవికిరణ్‌కుమార్‌ను సోమవారం అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో ఏఈఓ మల్లేషం, ఏపీఎం శంకర్, ఏఈఓ శ్యామ్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రతిభ, ఏపీఎంవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

వానొస్తే తిప్పలే..

- నిధులు మంజూరైనా పనులు పూర్తికాలే
- సా..గుతున్న హైలెవల్ వంతెనలు
- వాగులు పొంగితే రాకపోకలు బంద్



తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రహదారి



కోనాపూర్ వాగుపై కొనసాగుతున్న హైలెవల్ పనులు

సారంగాపూర్: ఈ వర్షాకాలంలో కూడా సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల ప్రజలకు తిప్పలు తప్పేలా లేవు. గతేడాది భారీ వర్షాలకు నష్టపోయిన రహదారులపై మరమ్మతు పనులు పూర్తి కాకపోవడంతో ఇరు మండలాల ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులు కలిగే అవకాశం ఉంది. నిధులు మంజూరైనా పనులు పూర్తి కాకపోవడంతో ఈ వర్షాకాలమైనా తిప్పలు తప్పేనా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

గతేడాది భారీ వర్షాలు

గతేడాది జూన్, జులై, ఆగస్టు మాసాల్లో కురిసిన భారీ వర్షాలతో సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల ప్రజలు అతలాకుతలం అయ్యారు. భారీ వరదలు వర్షాలతో జగిత్యాల జిల్లా కేంద్రం నుంచి సారంగాపూర్, బీర్‌పూర్ మండలాలతో పాటు, మంచిర్యాల జిల్లా జన్నారం నుంచి వచ్చే ప్రజలకు జిల్లా కేంద్రం నుంచి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న కోనాపూర్ ఎల్లమ్మ తల్లి ఆలయం వద్ద వాగు ఉప్పొంగి కోనాపూర్ లోలెవల్ వంతెనపై నుంచి భారీగా వరద వచ్చి రెండు మండలాలకు పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. ప్రతీ ఏడాదీ వర్షాకాలంలో ఈ తిప్పలు తప్పడం లేదు.

పరిష్కారం ఇలా..

కోనాపూర్ వద్ద హైలెవల్ వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ. 5.65 కోట్లు కేటాయించి నాలుగు నెలల క్రితం పనులు ప్రారంభించింది. పనులు దాదాపు 60 శాతం వరకు పూర్తయ్యాయి. మిగిలిన పనులు పూర్తి కావడానికి మరో రెండు నెలలు పట్టే అవకాశం ఉంది. ఈలోగా వర్షాకాలం పూర్తవుతుంది. వంతెన పనులు కొనసాగుతుండడంతో రాకపోకల కోసం పక్కనే మట్టి రోడ్డు ఏర్పాటు చేశారు. భారీ వర్షాలు కురిసి మట్టి రోడ్డు కొట్టుకుపోతే రాకపోకలకు కష్టమవుతుంది.

తుంగూర్–కండ్లపల్లి మధ్య..

గతేడాది రోల్లవాగు ప్రాజెక్టు తెగిపోయి తుంగూర్–కండ్లపల్లి గ్రామాల మధ్య రోడ్డుగా భారీగా కొట్టుకుపోయింది. ఇప్పటి వరకు వర్షాలు లేకపోవడంతో ప్రజలు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రోడ్డుపై రాకపోకలు సాగిస్తున్నారు. పనులు నిర్వహించడానికి ప్రభుత్వం రూ.47 లక్షలు మంజూరు చేసి, టెండర్లు పిలిస్తే పనులు చేపట్టడానికి కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు.

నర్సింహులపల్లె–చెర్లపల్లి రోడ్డుకు రూ.4.35 కోట్ల నిధులు..

నర్సింహులపల్లె–చెర్లపల్లి గ్రామాల మధ్య రోడ్డు రోల్లవాగు ప్రాజెక్టు తెగిపోయి రోడ్డు పూర్తిగా కొట్టుకుపోవడంతో దాదాపు ఏడాది కాలంగా రాకపోకలు నిలిచిపోయాయి. సమస్య పరిష్కారం కోసం ఆర్ అండ్‌బీ రూ. 4.35 కోట్లతో ప్రభుత్వం నిధులు మంజూరు చేసి టెండర్ల ప్రక్రియ దాదాపు పూర్తి చేసింది. కాంట్రాక్టరుకు పనుల అగ్రిమెంట్ జరిగిన తరువాత పనులు ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు. బీర్‌పూర్–కమ్మునూర్ ఆర్‌అండ్‌బీ డబుల్ రోడ్డుపై తాళ్లధర్మారం వద్ద హైలెవల్ వంతెనకు ఇరువైపులా అప్రోచ్ రోడ్డులు కోతకు గురై ప్రయాణికులకు కొంత సమస్య అవుతుంది. ఈ పనులు నిర్వహించడానికి టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు.

రాకపోకలు సాగడం కష్టమే



కోనాపూర్ వంతెన వద్ద ప్రతిసారీ వర్షాలకు వరదలతో ఉప్పొంగి రోజుల తరబడి రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఈ సారి వరదలు వస్తే సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల ప్రజలు తీవ్ర సమస్య ఎదుర్కొనే అవకాశం ఉంది. కోనాపూర్ వంతెనను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి. అధికారులు స్పందించి పనులు తొందరగా పూర్తి చేయించాలి.

– ముద్దం చిరంజీవి, పెంబట్ల

పనులు కొనసాగిస్తాం



వర్షాలు కొంత తక్కువగా ఉన్నా కోనాపూర్ వంతెన పనులు కొనసాగిస్తాం. వేసవిలో ఎండల తీవ్రత వల్ల కూలీల కొరతతో పనుల్లో జాప్యం జరిగింది. సారంగాపూర్, బీర్‌పూర్ మండలాలతో పాటు జన్నారం ప్రజల రాకపోకలకు వేసిన అప్రోచ్ రోడ్డు వర్షాలకు కొట్టుకుపోతే అప్పటికప్పుడు మళ్లీ తాత్కాలిక బైపాస్ చేయడానికి పైపులు, మట్టి సిద్ధంగా ఉంచాం.

– రాజశేఖర్, ఏఈ, ఆర్‌అండ్‌బీ, ఉమ్మడి సారంగాపూర్ మండలం

పాడి కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మల దహనం



కథలాపూర్‌లో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న ముదిరాజ్ కులస్తులు

జగిత్యాలటౌన్/ధర్మపురి/కథలాపూర్/ పెగడపల్లి /మెట్‌పల్లి/మల్లాపూర్/ఇబ్రహీంపట్నం: ముదిరాజ్ కులస్తులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని ముదిరాజ్ కులస్తులు డిమాండ్ చేశారు. సోమవారం జగిత్యాల జిల్లా వ్యాప్తంగా నిరసనలు చేపట్టి కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మకు శవయాత్రలు చేసి దహనం చేశారు. ముదిరాజ్ కులస్తులపై తప్పుడు వ్యాఖ్యలు చేసిన కౌశిక్‌రెడ్డికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఎమ్మెల్సీ పదవినుంచి, బీఆర్‌ఎస్ పార్టీ నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో ముదిరాజ్ సంఘాల అధ్యక్షులు, వివిధ మండలాల బాధ్యులు, ప్రజాప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు అండగా ప్రభుత్వం



చెక్కు అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

మెట్‌పల్లి: పేద కుటుంబాల్లో ఆడపిల్లల పెళ్లికి ఆర్థిక సాయం అందిస్తున్న ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనని మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత, ఎంపీపీ మారు సాయిరెడ్డి అన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం బీఆర్‌ఎస్ నాయకుడు కల్వకుంట్ల సంజయ్‌తో కలిసి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో ఏ ప్రభుత్వం కూడా ఇలాంటి పథకాలను అమలు చేయలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి బీఆర్‌ఎస్ గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమాల్లో కౌన్సిలర్లు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికి సంక్షేమ ఫలాలు

కోరుట్ల: రాష్ట్రంలో ప్రతీ ఇంటికి అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించటమే లక్ష్యంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పని చేస్తోందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కల్వకుంట్ల సంజయ్ అన్నారు. సోమవారం పట్టణంలోని 16వ వార్డులో మన ఇంటికీ మన సంజయన్న కార్యక్రమంలో భాగంగా వార్డు ప్రజలను కలిసి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. ఆరోగ్య సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని వీలైతే ఉచిత ఆపరేషన్ చేసే విధంగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, పట్టణ బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి గుడ్ల మనోహర్, మైనార్టీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ ఫహీం, సీనియర్ నాయకుడు బలిజ రాజరెడ్డి, పట్టణ యూత్ ఉపాధ్యక్షుడు బలిజ శివప్రసాద్, చిత్తరి ఆనంద్, ప్రభూ, చిట్యాల కరుణాకర్, వేణు గోపాల్, పొట్ట సురేందర్, వేకల మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ కోటేశ్వర్

పెగడపల్లి: గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని మల్యాల సీఐ బిల్ల కోటేశ్వర్ సూచించారు. పెగడపల్లి మోడల్ స్కూల్లో సోమవారం స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో గంజాయి, డ్రగ్స్ నిషేధంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల మత్తులో జీవితాలు పాడు చేసుకోవద్దన్నారు. మత్తులో నేరాలు చేస్తే సమాజంలో నేరస్థులుగా మిగిలిపోతారని పేర్కొన్నారు. విద్యార్థులు చదువులపై దృష్టి సారించి ఉన్నత చదువులు చదువుకొని తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకొని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై సీహెచ్ సతీశ్, ప్రిన్సిపాల్ రవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలలో పఠనోత్సవం



విద్యార్థులతో చదివిస్తున్న ఉపాధ్యాయులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పఠనోత్సవ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాఠాలను చదివి వినిపించారు. ఈ మేరకు హెచ్‌ఎం గడ్డం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చే నెల 31 వరకు ప్రభుత్వ ఆదేశాల మేరకు పఠనోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేందర్, కృష్ణప్రసాద్, మురళి, ఇమ్మానుయేల్, మమత, ఇబ్రహీం, లక్ష్మి, విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి



ప్రభుత్వ పాఠశాల వద్ద ఏబీవీపీ నాయకులు

కోరుట్లటౌన్:ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని నగర కార్యదర్శి మాడవేని సునీల్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను ఏబీవీపీ ఆధ్వర్యంలో బంద్ చేయించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు దుస్తులు పంపిణీ కాలేదని ఆరోపణలు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామన్నారు.కార్యక్రమంలో నాయకులు పవన్, సంజీవ్, అభి, వినయ్, సూరజ్, పవన్, సాయిప్రసాద్, వికాస్, శివ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలి

మల్లాపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకులు మెనూ పాటించాలని సర్పంచ్ సయ్యద్ హైదర్ అన్నారు. సోమవారం మల్లాపూర్ మండలంలోని హుస్సేన్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలను ఆయన సందర్శించి మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సదన్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బీపీ మిషన్ల పంపిణీ

రాయికల్: మండలంలోని ఒడ్డెలింగాపూర్‌లో ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బందికి మెడికల్ ఆఫీసర్ సతీశ్ ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్ బీపీ కొలిచే యంత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న పెన్షనర్లు

కోరుట్ల: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పెన్షనర్ల సంఘం కోరుట్ల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ నీరటి రాజేశ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈహెచ్ ఎస్‌ను పూర్తిస్థాయిలో వెంటనే అమలు చేయాలని, 22వ పీఆర్సీ కమిటీని నియమించి జూలై ఒకటి నుంచి అమలు చేయడంతో పాటు, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రేగుల భూమానందం, ప్రధాన కార్యదర్శి ఎస్ ప్రకాశ్, సభ్యులు పాల్గొన్నారు.

మల్యాల: ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని పెన్షనర్లు తహసీల్దార్ సుజాతకు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈహెచ్‌ఎస్ పూర్తిస్థాయిలో అమలు చేయాలని, పీఆర్సీ బకాయిలు చెల్లించాలని ప్రతి నెలా ఒకటో తేదీన పెన్షన్ డబ్బులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సుభాష్ రావు, ఎం.రాంచంద్రం, జి.అంజయ్య, డి.లక్ష్మారెడ్డి, మంగీలాల్, జయశీల, మహమూద్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు, మందులు అమ్మితే కఠిన చర్యలు



షాపులో తనిఖీ చేస్తున్న ఏవో అనూష

సారంగాపూర్: రైతులకు నకిలీ విత్తనాలు, మందులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని బీర్‌పూర్ మండల వ్యవసాయాధికారి అనూష అన్నారు. సోమవారం బీర్‌పూర్, నర్సింహులపల్లె, తుంగూర్ గ్రామాల్లోని ఎరువులు, విత్తనాల, ఇతర వ్యవసాయ అనుబంధ విక్రయ దుకాణాలను ఆమె తనిఖీ చేసి రికార్డులను, ఇతర బిల్లులను, కంపెనీ లేబుళ్లను పరిశీలించారు. ప్రతి రైతుకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులను విక్రయించి, రశీదు తప్పనిసరిగా ఇవ్వాలని ఆదేశించారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన



ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలో సోమవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. వైద్య శిబిరాన్ని సర్పంచ్ నేమూరి లత ప్రారంభించారు. కరీంనగర్ రేకుర్తికి చెందిన వైద్యులు ప్రభాకర్ 175 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 80 మందికి కంటి శస్త్ర చికిత్సలకు అవసరం ఉండగా మొదటి విడతగా 40 మందిని ప్రత్యేక బస్సుల్లో రేకుర్తి కంటి ఆస్పత్రికి తరలించారు. మిగతా 40 మంది వచ్చే నెల 6న పంపిస్తున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎలేటి చిన్నారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ కొట గంగజీవన్, మాజీ అధ్యక్షుడు నేమూరి సత్యనారాయణ, లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి అలిశెట్టి మోహన్, ఉపాధ్యక్షులు గూడ శాంతభూషన్, జింక శ్రీనివాస్, సభ్యులు, ఎంపీటీసీ తిమ్మణి రాములు, ఉపసర్పంచ్, రాంరెడ్డి, పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

రైతు సమన్వయసమితి సభ్యుడికి పరామర్శ

కథలాపూర్: బీమారం మండలం వెంకట్రావుపేట గ్రామానికి చెందిన జిల్లా రైతు సమన్వయసమితి సభ్యుడు కాటిపెల్లి శ్రీపాల్‌రెడ్డిని సోమవారం ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ పరామర్శించారు. శ్రీపాల్‌రెడ్డి తండ్రి లక్ష్మారెడ్డి 15 రోజుల క్రితం మృతిచెందారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకొని ఓదార్చారు. ఆయన వెంట జెడ్పీ వైస్‌చైర్మన్ హరిచరణ్‌రావు, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, ఎంపీపీ జవ్వాజి రేవతి, సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

బాధితులకు ఎంపీడీవో పరామర్శ

ఇబ్రహీంపట్నం: మండలంలోని అమ్మక్కపేటలో ఆదివారం పిచ్చికుక్క దాడిలో లవంగ శంకర్ , పండ్ల లక్ష్మీ గాయపడ్డారు. అడిషనల్ కలెక్టర్ మకరంద ఆదేశాల మేరకు సోమవారం ఎంపీడీవో ప్రభ పరామర్శించారు. వైద్యాధికారి శ్రీజకు ఫోన్ చేసి గాయపడ్డవారికి చికిత్స చేసి మందులను అందించాలని కోరారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు చెరువుల పండగ తంటా

జగిత్యాలరూరల్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవంలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు పొలాస గ్రామంలో ఊర చెరువు వద్ద సర్పంచ్ చెరువుల పండగను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వం రూ.40 వేలు మంజూరు చేయగా, అదనంగా మరో రూ.60 వేలు పెట్టి పండగ చేశారు. అదనపు ఖర్చును చేపల చెరువు కాంట్రాక్టర్ చెల్లిస్తానని చెప్పాడని, సోమవారం చెరువులో చేపలు పడుతుండగా చెరువుల పండగ ఖర్చు చెల్లించాలని సర్పంచ్ భర్త కోరడంతో కాంట్రాక్టర్ పట్టిన చేపలను కిందపడబోసి నిరసన వ్యక్తం చేశాడు. పండగ ఖర్చును ప్రభుత్వమే చెల్లించాలని, తాము చెల్లించలేమని మొండికేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

మల్లాపూర్: మండలంలోని రత్నాపూర్‌లో ఇటీవల భారీ వర్షానికి బక్కూరి శేఖర్ ఇళ్లు దెబ్బతినడంతో, బాధిత కుటుంబానికి సోమవారం గల్ఫ్ కార్మికుల సేవాసమితి ఆధ్వర్యంలో రూ.5 వేల ఆర్థికసాయం అందించారు.ప్రభుత్వం డబుల్‌బెడ్ రూం ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు యానం శ్రీనివాస్, బాస మహేశ్, యానం రమేష్, తోటల రాజేశ్వర్, పట్నం చిల్కయ్య, గడుసంద గంగమల్లయ్య, పడిగెల దేవన్న, వెంకటేశ్, మస్కాల రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ ప్రారంభం

కథలాపూర్: మేడిపెల్లి మండలం తొంబర్రావుపేట ఎస్సీ కాలనీలో కొత్తగా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్‌ను జెడ్పీ వైస్‌చైర్మన్ హరిచరణ్‌రావు సోమవారం ప్రారంభించారు. మండల పరిషత్ నిధులు రూ. 1.60 లక్షలతో హైమాస్ట్‌లైట్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉమాదేవి, సర్పంచులు మామిడి సత్తమ్మ, సంపత్ కుమార్, రమేశ్‌రెడ్డి, ఎం.డీ హైమాద్ పాల్గొన్నారు.

ఎస్సైని కలిసిన నాయకులు

కోరుట్ల రూరల్: మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ చైర్మన్లు సోమవారం ఎస్సై కిరణ్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. శాంతి భద్రతల పరిరక్షణలో తమ వంతు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్యాక్స్ చైర్మన్ల సంఘం ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి నర్సారెడ్డి, ప్యాక్స్ చైర్మన్లు బండి భూమయ్య, గడ్డం ఆదిరెడ్డి, ఎలిశెట్టి భూమారెడ్డి, సాయిరెడ్డి, జగన్మోహన్ రావు పాల్గొన్నారు.

కిసాన్‌మోర్చా మండల అధ్యక్షుడి రాజీనామా

కొండగట్టు: కిసాన్‌మోర్చా కొడిమ్యాల మండల అధ్యక్షుడు సురకంటి ముత్యంరెడ్డి తన పదవికి రాజీనామా చేసినట్లు సోమవారం ప్రకటనలో తెలిపారు. ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్ల అరాచకాలు, వడగండ్ల వర్షాలకు మండల ప్రజలకు భరోసా ఇవ్వాలని తెలిపినా జిల్లా, నియోజకవర్గ మండల నాయకులు కనీస చొరవ చూపలేదని తెలిపారు. పోలీసులు తనను అరెస్టు చేసినా నాయకులు రాలేదని, పార్టీ కార్యక్రమాలకు తనవంతుగా అనేకంగా కృషిచేశానని, పలు సమస్యలతో రాజీనామా చేశానని ముత్యంరెడ్డి పేర్కొన్నారు.

ఉపాధి పనులు పరిశీలన

ఇబ్రహీంపట్నం: ఉపాధి హామీ కూలీలకు కూలి డబ్బులు వస్తాయని ఎంపీడీవో ప్రభ తెలిపారు. సోమవారం మండలంలోని తిమ్మాపూర్ తండా, వేములకుర్తి గ్రామాల్లో పనిచేస్తున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. తిమ్మాపూర్ తండాలో కూలి డబ్బులు ఆలస్యంగా వస్తున్నాయని కూలీలు ఎంపీడీవో ప్రభకు విన్నవించగా సంబంధిత పోస్టు మాస్టర్‌కు ఫోన్ చేసి కూలి డబ్బులు ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ శ్రావంతి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు ఆర్టీసీ డిపోలో రక్తదాన శిబిరం

కోరుట్ల రూరల్: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకుమెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ప్రసూన లక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకరి రక్తదానం ముగ్గురికి ప్రాణ దానం అనే కార్యక్రమంలో భాగంగా ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. స్వచ్ఛంద సేవా సంస్థలు, యువజన సంఘాలు, విద్యార్థులు, ఆర్టీసీ సిబ్బంది ఈ మెగా రక్తదాన శిబిరంలో పాల్గొనాలని డీఎం కోరారు. వివరాలకు 9959225928, 7382849639, 9700212293 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.